క్లుప్తంగా



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఈపూరి గణేశ్ మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గణేశ్‌ను వైఎస్ జగన్ ఆత్మీయంగా పలకరించారు. పలు అంశాలపై చర్చించారు. - రేపల్లె రూరల్

గజానన గౌరీమాతగా బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో కొలువైన బగళాముఖి అమ్మవారి ఆలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని గజానన గౌరీ మాతగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి మాట్లాడుతూ ఆడ పిల్లల కోసం వివాహ దోష నివారణ కోసం ప్రతి మంగళవారం ఆలయంలో హరిద్ర శృంగార్చన పూజ జరుగుతుందని తెలిపారు.

జాబ్‌మేళాలో 39 మంది ఎంపిక

రేపల్లెరూరల్: పట్టణంలోని శారద ఐటీఐ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ కంపెనీలకు 39 మంది ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ వెంకట నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్గేట్, టీహెచ్‌కే జపనీస్, శ్రీసిటీలకు చెందిన కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన జాబ్‌మేళాలో తమ కళాశాల నుంచి పాల్గొన్న 40 మందిలో 39 మంది ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోత్స్న, ప్లేస్‌మెంట్ అధికారి ప్రసాద్, ఆయాకంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకుంటాం



నిజాంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మత్స్యకారులకు అందాల్సిన ప్రతి పథకాన్ని పూర్తిస్థాయిలో అందేలా కృషి చేస్తానని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. నిజాంపట్నం హార్బర్‌లో మంగళవారం ఎంపీ కృష్ణ ప్రసాద్ పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన ద్వారా ఎక్కువ నిధులు తీసుకుచ్చి మత్స్యకారుల అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, స్థానిక మత్స్యకారులు ఉన్నారు.

సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

భట్టిప్రోలు: వరదను అంచనా వేయడంతో పాటు సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి విమర్శించారు. మంగళవారం భట్టిప్రోలు మండలంలోని వరద ప్రభావిత గ్రామాలలో సీపీఎం బృందం పర్యటించింది. రమాదేవి మాట్లాడుతూ అధికారులు సరైన సమయంలో బాధితులకు ఆహారం అందించలేకపోయారని చెప్పారు. బోట్లూ సరిపడా ఏర్పాటు చేయలేదని ధ్వజమెత్తారు. రమాదేవి వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, మండల కార్యదర్శి జి.సుధాకర్ తదితరులు ఉన్నారు.

యువతకు నాయకత్వ లక్షణాలు అవసరం

బాపట్ల: యువతకు నాయకత్వ లక్షణాలు అవసరమని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఆంజనేయులు పేర్కొన్నారు. కళాశాల్లో బెంగళూరుకు చెందిన ఉన్నతి సంస్థ, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో యూనిక్స్ శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ప్రిన్సిపాల్ పి.ఆంజనేయులు మాట్లాడుతూ యువత నైపుణ్యాలు, నైతిక విలువలు పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి.ఒ వెంకట్, ఉపాధ్యాయులు డి.రాజకుమారి, పిచ్చయ్య, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లంకల్లో జలదరింపు



కొల్లూరు నుంచి పన్నెండు లంక గ్రామాలకు వెళ్లే మార్గంలో వరద ఉధృతి



కొల్లూరు మండలం తోకలవారిపాలెంలో వరద నీటి ముంపులో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం

- ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు
- విద్యుత్ సరఫరా నిలుపుదల
- సహాయం కోసం నిరీక్షిస్తున్న బాధితులు

భట్టిప్రోలు/కొల్లూరు/బాపట్ల/వేమూరు/రేపల్లెరూరల్/పిట్టలవానిపాలెం: కృష్ణమ్మ శాంతించినా ముంపు వీడలేదు. వరద ఉధృతితో లంక గ్రామాలు అల్లాడుతున్నాయి. ఊళ్లకు ఊళ్లు కన్నీరవుతున్నాయి. ఆహారం, తాగునీరు అందక హాహాకారాలు చేస్తున్నాయి. సాయం చేసే చేతుల కోసం నిరీక్షిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన సహాయక చర్యలు ఇంకా చాలా గ్రామాలకు చేరడం లేదు. ఫలితంగా ప్రజలు విలపిస్తున్నారు. భట్టిప్రోలు మండలంలోని పెదలంక, పెసర్లంక, చింతమోటు, ఓలేరు పల్లెపాలెం గ్రామాలు ఇంకా జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. రాత్రీపగలూ ప్రజలు భయం గుప్పెట్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. అయినా చాలా మంది గ్రామాలను వీడి బయటకు వచ్చేందుకు ఇష్టపడడం లేదు. ఫలితంగా అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు వారి వద్దకే వెళ్లి ఆహారపొట్లాలు, మంచినీరు అందిస్తున్నాయి. చాలా గ్రామాలకు ఆహారపొట్లాలు, తాగునీరు అందడం లేదు. మండలంలోని వెల్లటూరు జెడ్పీ ఉన్నత, భట్టిప్రోలు విశ్వశాంతి, ఓలేరు ఎస్‌కేవీఎస్ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాలు కొనసాగుతున్నాయి.



కొల్లూరు మండలం తోకలవారిపాలెంలో మూగ జీవాలతోపాటు భవనంపైకి చేరిన బాధితులు



భట్టిప్రోలు-పెదపులివర్రు రహదారిలో నీటిలో నానుతున్న వరి పంట

■ పొలాలు ఇంకా వరద నీటిలోనే నానుతున్నాయి. వెల్లటూరు ఎస్సీ, ఎస్టీ సొసైటీల కింద సాగవుతున్న 250 ఎకరాలు, పెదపులివర్రు సొసైటీ కింద సాగులో ఉన్న 154 ఎకరాల్లోని వాణిజ్య పంటలు ముంపునకు గురయ్యాయి. దాదాపు 2వేల ఎకరాల్లో పసుపు పంట దెబ్బతింది. 5 వేల ఎకరాల్లో అరటి, 300 ఎకరాల్లో కూరగాయల తోటలకు నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



పంటలను రక్షించుకునేందుకు రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ అక్తర్‌హుస్సేన్ సూచించారు. బాపట్ల మండలంలోని అప్పికట్ల, పూండ్ల, గోపాపురం, గుడిపూడి గ్రామాల్లో మంగళవారం ముంపునకు గురైన పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి ఆర్.చంద్రశేఖర్ వరిలో పాము పొడ తెగులు ఉధృతికి అవకాశం ఉంటుందని చెప్పారు. నివారణ చర్యలు వివరించారు.

ఆపన్నహస్తం



భట్టిప్రోలు మండలం వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లోని పునరావాస కేంద్రానికి ఏపీసీపీఎస్‌ఈఏ సంఘం మంగళవారం ఆపన్నహస్తం అందించింది. 60 మంది వరద బాధితులకు పౌష్టికాహారం అందించింది. కార్యక్రమంలో సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహన్, శివరామకృష్ణ, షైనీ, రామారావు తదితరులు పాల్గొన్నారు. సత్యసాయిబాబా సేవా సంస్థలు భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని వరద బాధిత కుటుంబాలకు పెరుగు, పాల ప్యాకెట్లు పడవల ద్వారా పంపినట్లు బాపట్ల జిల్లా ఆధ్యాత్మిక కో-ఆర్డినేటర్ ధారా నారాయణ మూర్తి తెలిపారు.

అన్నదాతలను ఆదుకుంటాం



వర్షాల వల్ల నష్టపోయిన ప్రతిరైతునూ ఆదుకుంటామని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. భవనంవారిపాలెం, కోమలి గ్రామాలలో నీటి ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. అనంతరం కోమలి గ్రామంలోని రక్షిత మంచినీటి చెరువును పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మోదుగుల శంకర్‌రెడ్డి, కలకోట కిషోర్‌రెడ్డి, శ్యామల మోహనరెడ్డి ఉన్నారు.



కొల్లూరు మండలం దోనేపూడి చినరేవు వద్ద అరటి గెలలను తాకుతూ ప్రవహిస్తున్న వరద

పంట పొలాల పరిశీలన



బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖ డీడీఏ విజయనిర్మల, శాస్త్రవేత్తలు డాక్టర్ మృదుల, డాక్టర్ ఉషా మంగళవారం నీటమునిగిన పొలాలను పరిశీలించారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో రైతులకు ముంపు నుంచి పొలాలు ఎలా కాపాడుకోవాలో వివరించారు. వీరి వెంట వ్యవసాయ శాఖాధికారి జి. మీరయ్య, ఎంపీఈఓ భార్గవి, సిబ్బంది పాల్గొన్నారు.



కొల్లూరు మండలం పెదలంకలో ఆహారపదార్థాలను పడవ నుంచి దించుతున్న సిబ్బంది



కొల్లూరు మండలం తురకపాలెంలో నీటిలోనే ట్రాక్టర్ ట్రక్కుకు కట్టేసి ఉంచిన పశువులు



కొల్లూరు మండలం తోకలవారిపాలెంలో పడవల్లో వచ్చిన ఆహార ప్యాకెట్‌లను తెచ్చుకుంటున్న స్థానికులు

భోజనం, తాగునీరు పంపిణీ



భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక గ్రామాలలోని వరద బాధితులకు మంగళవారం ఐదువేల భోజనం ప్యాకెట్లు, తాగునీటి బాటిళ్లను పంపిస్తున్నట్లు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు.



తిప్పలకట్టలో ఓ ఇంట్లోకి వరద నీరు చేరడంతో తేలుతున్న వంట పాత్రలు



భట్టిప్రోలు మండలం పెదపులివర్రు దిగువున అరటి తోటల్లోని గెలలను ఒడ్డుకు చేర్చిన దృశ్యం



కొల్లూరు కరకట్ట వద్ద నుంచి పడవలలో ఆహారం, మంచినీరు పంపిణీ



కొల్లూరు కరకట్ట పైన లంక గ్రామాలకు తరలించేందుకు ఉంచిన మంచినీటి బాటిళ్లు

'హృదయ'విదారకం



ఈ చిత్రంలో మంచినీరు తాగుతున్న మహిళ పేరు సుంకర రేణుక. ఊరు పోతార్లంక. ఈమె హృద్రోగంతో బాధపడుతుండడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు పడవలో దోనేపూడి తీసుకొచ్చారు. కరకట్టపైకి రాగానే ఆమె కుప్పకూలారు. దీంతో ఆమెను కుర్చీలో కూర్చోబెట్టి తోటి మహిళలు సపర్యలు చేశారు. ఈ ఘటన స్థానికుల హృదయాలను కలచివేసింది.

లబోదిబౌ



వరదకు మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాయి. కొల్లూరు మండలం తిప్పలకట్టలో శునకాలు బతుకు జీవుడా అంటూ ఇలా ఇంటి రేకుల పైకి చేరి వరద నీరు ఎప్పటికి తగ్గుతుందా అని దీనంగా చూస్తున్నాయి.

వరదాయినీ వేడు'కోళ్లు' వినవే..!



కృష్ణమ్మ వరద ముంపు వల్ల కోళ్లు విలవిల్లాడుతున్నాయి. కొల్లూరు మండలం పోతార్లంక వద్ద ఇలా గడ్డివాము ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నాయి. నీరు ఎప్పటికి తగ్గుతుందోనని కొక్కొరొక్కో అంటూ నిరీక్షిస్తున్నాయి.



కొల్లూరు మండలం తోకలవారిపాలెంలో పడవలో వచ్చిన ఆహారం తీసుకెళ్తున్న గ్రామస్తులు



వరద నీటిలో తోకలవారిపాలెం

■ పాముకాటుకు గేదె మృతి

వేమూరు: పాము కాటు వల్ల గేదె మృతి చెందింది. మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన అమర్తలూరు వెంకయ్య గేదె సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. భారీ వర్షాల వల్ల చుట్టుపక్కల నీరు నిలిచిపోవడంతో గేదెల చావిడిలోకి వచ్చిన పాము గేదెను కాటువేసి ఉంటుందని భావిస్తున్నారు.

ముంపు గ్రామాల్లో పశువైద్య సేవలకు సన్నద్ధం

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ హనుమంతరావు

భట్టిప్రోలు: కృష్ణానది వరదల నేపథ్యంలో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో భట్టిప్రోలు, కొల్లూరు మండలాలలోని 20 లంక గ్రామాల్లో పశు వైద్యసేవలు అందించేందుకు సన్నద్ధం చేసినట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు మంగళవారం తెలిపారు. ఇప్పటికే 95 మెట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణా ఆయా మండలాలకు చేరిందని చెప్పారు. ఈ దాణాను పాడి రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు మండలాల్లోని గ్రామాలలో పశు వైద్యశిబిరాలు నిర్వహించేందుకు సిబ్బందిని పంపామన్నారు. ఒక్కో గ్రామానికి రూ.10 వేలు వంతున ప్రభుత్వం మందుల కోసం కేటాయించినట్లు చెప్పారు. అత్యవసర సేవలు అందించేందుకు కొల్లూరులో 3, భట్టిప్రోలులో ఒకటి వాహనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే 6 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలు కూడా వస్తున్నాయని తెలిపారు. ఈ వైద్యశిబిరాలలో గర్భకోశ వ్యాధులు, అత్యవసర కేసులతో పాటు గొంతు వాపు, గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. 20 టీంల ఆధ్వర్యంలో ఒక్కో హాబిటేషన్‌లో శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.



లంక గ్రామాలకు చేరిన సంపూర్ణ మిశ్రమ దాణా లారీ వద్ద డాక్టర్ హనుమంతరావు